


తిరుపతిలో కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు


# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




# అందరిలోనూ ఉత్కంఠతే !!

## ఓట్ల లెక్కింపుకు పటిష్టభద్రత
## తిరుపతి పూర్తిగా డ్రోన్‌లు, సిసికెమెరాలతో నిఘా




తిరుపతి, జూన్ 3(ప్రభాతవార్త: ఎంతో ఉత్కంఠభరితంగా మే 13వతేదీ జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఓట్ల లెక్కింపు కేవలం కొన్నిగంటలు మాత్రమే ఉండటంతో అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. ఓటరన్న తీర్పుపై తిరుపతి జిల్లాలో అన్ని ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. మరికొన్ని గంటల్లో ఈవిఎంలలో నిక్షిప్తమైన ఓట్ల లెక్కింపు ప్రారంభమై ఫలితాలు వెలువడనున్న సమయంలో వైసిపి, ఎన్డీఏ కూటమిలో భాగస్వామ్యమైన టిడిపి, జనసేన, బిజెపి పార్టీల అభ్యర్థుల్లోనేగాక జనంలోనూ సర్వత్రా టెన్షన్‌తో చూస్తున్నారు. గత 22రోజులుగా వివిధ అంచనాలతో గెలుపు తమదంటే తమదని కాలం వెల్లదీసిన నేతలకు ప్రజల నాడి అంచనా వేయలేక ,ఇప్పటికే వెలువడిన ఎగ్జిట్‌ఫోల్ సర్వేలతో బాంబు పేలాయి. ఇప్పుడు నేడు మంగళవారం ఉదయం 8గంటలకు తిరుపతిలోని పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల స్ట్రాంగ్‌రూమ్‌ల సమీపంలో ఓట్ల లెక్కింపు చేపడతారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు, భద్రత చర్యలు జిల్లా యంత్రాంగం పూర్తిచేసింది. ఏజెంట్లు, ఆర్‌ఓలు ఉదయం 6గంటలకు ఓట్ల లెక్కింపు కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఆయా పార్టీలకు చెందిన ఏజెంట్లు వ్యవహరించాల్సిన తీరు, ఓట్ల లెక్కింపు సిబ్బందికి సూచనలు చేశారు. మరీ కొన్నిగంటల్లో మొదలయ్యే ఓట్ల లెక్కింపులో నేతల భవితవ్యం తేలిపోనుంది.

### తిరుపతి జిల్లాలో పోటీవీరే...:

తిరుపతి జిల్లాలో మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి, ఒక పార్లమెంట్ స్థానానికి ప్రధానంగా వైసిపి, టిడిపి, బిజెపి, జనసేన,కాంగ్రెస్ పార్టీల నుండి పోటీలో దిగారు. తిరుపతి పార్లమెంట్‌కు వైసిపి తరపున సిట్టింగ్ ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి, ఎన్‌డిఎ కూటమి నుండి బిజెపి అభ్యర్థిగా వరప్రసాద్, కాంగ్రెస్ పార్టీనుండి మాజీ ఎంపి, మాజీకేంద్రమంత్రి డాక్టర్ చింతామోహన్ పోటీ చేశారు. వీరు ముగ్గురూ రాజకీయంగా చతురత కలిగిన నేతలైనా ప్రజల మనసును ఆకట్టుకున్న వారెవరనేది అంచనా వేయలేకపోతున్నారు. ఇప్పటికే తిరుపతి ఎంపిగా డాక్టర్ గురుమూర్తి పనితీరుపై పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల ప్రజలు భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మరీ ఓటర్లు ఏ పార్టీవైపు మొగ్గుచూపారనేది ఈవిఎంలు తెరిస్తే తేలిపోనుంది. ఇక తిరుపతి,చంద్రగిరి, శ్రీకాళహస్తి, వెంకటగిరి, గూడూరు, సూళ్ళూరుపేట, సత్యవేడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ప్రధాన పార్టీలు వైసిపి, టిడిపి,జనసేన అభ్యర్థుల మధ్య పోటీ నెలకొంది. మిగిలిన వారంతా స్వతంత్రఅభ్యర్థులే. వీరిలో గెలుపు ఎవరిదనేది నేడు మధ్యాహ్నం 12గంటలకు దాదాపు స్పష్టంగా తేలిపోనుంది. తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల నుండి సిట్టింగ్ ఎమ్మెల్యేలు, రాజకీయ వారసత్వం ఉన్న వారసులు పోటీపడ్డారు. వీరిని ఎంతవరకు ఓటర్లు ఆదరించారనేది నేటి ఫలితాలతో స్పష్టం కానుంది. కాగా 13న జరిగిన పోలింగ్ ఘటనలతో అప్రమత్తమైన అధికార యంత్రాంగం ఓట్ల లెక్కింపు ప్రక్రియను మరింత కట్టుదిట్టంగా చేపడుతోంది. ఇప్పటికే భద్రత పరంగా పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం పరిధిలో 3కిలోమీటర్లు వరకు నోఫ్లయింగ్ జోన్‌గా నిర్ణయించారు. నగరంలో భద్రతపరంగా డ్రోన్‌కెమెరాలు, సిసికెమెరాల పర్యవేక్షణ ఉంది. ఎక్కడ చిన్నపాటి సంఘటన జరిగినా క్షణాల్లో భద్రత బలగాలు చేరుకునేలా సిద్దంగా ఉన్నారు.

# టెన్షన్‌కు నేడు తెర

**గెలుపుపై ఇరు పార్టీల అభ్యర్థుల్లో ధీమా!**
**ఉదయం 11 గంటలకల్లా ట్రెండ్ తెలిసే అవకాశం**

**సార్వత్రిక ఎన్నికలు-2024 ఫలితాల ఓట్ల లెక్కింపు మంగళవారం ఉదయం 8 గంటల నుండి చిత్తూరు ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాల ఓట్ల లెక్కింపు కేంద్రంలో ప్రారంభం కానుంది. ఎన్నికల పోలింగ్ పూర్తయి 23 రోజులు పూర్తి కావస్తుండటంతో ఇప్పటి వరకు టెన్షన్‌ను అనుభవించిన ఎన్నికల్లో పోటీ చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు, రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు, ప్రజలు ఇప్పటి వరకు అనుభవించిన టెన్షన్‌కు తెరపడనుంది.**



చిత్తూరు, జూన్ 3 ప్రభాతవార్త: దేశ వ్యాప్తంగా జూన్ 1వ తేదీ ఎన్నికల పోలింగ్ ముగియడంతో అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు వివిధ సంస్థలు వెల్లడించిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలతో అభ్యర్థులు, రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు, ప్రజల్లో వున్న టెన్షన్‌కు ఉపశమనం కలుగుతుందని అందరు భావించారు. అయితే ఎగ్జిట్ పోల్ ఫలితాల్లో ఏ ఒక్క సంస్థ ఇచ్చిన ఫలితాలు అభ్యర్థులు, రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు, ప్రజలకు సంతృప్తి పరచలేకపోయాయి. దీంతో అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఎగ్జాట్ పోలింగ్ ఫలితాలపై దృష్టి కేంద్రీకరించడంతో ఉత్కంఠత ఏర్పడింది. చిత్తూరు జిల్లాలో ఒక పార్లమెంటు స్థానం, ఏడు అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో పోటీ ప్రధానంగా వైకాపా, తెలుగుదేశం పార్టీల మధ్య కేంద్రీకృతమైవుంది. చిత్తూరు ఎంపీ స్థానానికి తెలుగుదేశం అభ్యర్థిగా దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, వైకాపా అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ రెడ్డప్పలు పోటీ చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో ఒక్క కుప్పం అసెంబ్లీ నియోజకవర్గం మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో వైకాపా ఎంపీ అభ్యర్థి రెడ్డప్పకు భారీ మెజార్టీ రావడంతో చిత్తూరు పార్లమెంటు స్థానం చరిత్రను తిరగరాసి ఎంపీగా వైకాపా అభ్యర్థి ఎన్.రెడ్డప్ప ఎన్నికయ్యారు. అయితే ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో ఇలాంటి పరిస్థితి కన్పించడం లేదు. ఇక్కడి నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన దగ్గుమళ్ళ ప్రసాదరావుకు ఈ సారి విజయం వరిస్తుందని భావిస్తున్నారు. కుప్పం అసెంబ్లీ స్థానం నుండి తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన ఆ పార్టీ అధినేత ఇక్కడి నుండి భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని పలు సంస్థల ఎగ్జిట్ పోల్స్ ప్రకటించడంతో ఎగ్జాట్ పోల్ ఫలితాలు సైతం ఇదే తరహాలో వుంటాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఇక్కడి నుండి పోటీ చేసిన వైకాపా అభ్యర్థి ఎమ్మెల్సీ భరత్ సైతం విజయం తనదేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. పుంగనూరు అసెంబ్లీ స్థానం నుండి వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ఇప్పటికే పలు ఎగ్జిట్ పోల్స్ ప్రకటించాయి. అలాగే నగరి అసెంబ్లీ స్థానం నుండి పోటీ చేసిన మంత్రి ఆర్‌కె రోజా ఈ ఎన్నికల్లో ఓటమి చెందనుందని ఇప్పటికే పలు ఎగ్జిట్ పోల్స్ ప్రకటించాయి. ఇక్కడి నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన గాలి భానుప్రకాష్ ఈ ఎన్నికల్లో మంత్రి ఆర్‌కె రోజాపై విజయం సాధించనున్నారని ఎగ్జిట్ పోల్స్ ప్రకటించాయి. పలమనేరు అసెంబ్లీ స్థానం నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన మాజీ మంత్రి అమరనాధరెడ్డి ఈ ఎన్నికల్లో విజయం సులభంగా లభిస్తుందని పలు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. అయితే ఇక్కడి నుండి వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన వెంకటేగౌడకు వి.కోట మండల పరిధిలో భారీ ఓటింగ్ నమోదు కావడంతో ఈ సారి స్వల్ప తేడాతో అయిన వైకాపా సిట్టింగ్ ఎమ్మెల్యే వెంకటేగౌడ విజయం సాధించవచ్చునని వైకాపా నేతలు ఆశలు పెట్టుకున్నారు. ఇక చంద్రగిరి నుండి వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలుగుదేశం అభ్యర్థి పులివర్తి నానిల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఇక్కడ నుండి పోటీ చేసిన ఇరు పార్టీల అభ్యర్థులు విజయం తమదంటే తమదేనంటూ ధీమా వ్యక్తం చేస్తుండటంతో ఎన్నికల ఫలితాలు పూర్తి స్థాయిలో వచ్చే వరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. జిడినెల్లూరు అసెంబ్లీ స్థానం నుండి వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన కృపాలక్ష్మీ విజయం సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్ పేర్కొనడంతో వైకాపా శ్రేణుల్లో ఆనందం వ్యక్తం అవుతుంది. మరోవైపు ఇక్కడి నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ థామస్ విజయం తనదేననే ధీమాలో వున్నారు. పూతలపట్టు అసెంబ్లీ స్థానం నుండి వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ సునీల్‌కుమార్ విజయంపై ఆశలు పెట్టుకున్నారు. మరోవైపు తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసిన డాక్టర్ మురళీమోహన్ ఈ సారి ఇక్కడి నుండి విజయం సాధించి పూతలపట్టు నియోజకవర్గ ఎన్నికల ఫలితాల చరిత్రను తిరగరాస్తామని ధీమాలో వున్నారు. ఇక్కడి నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వైకాపా సిట్టింగ్ ఎమ్మెల్యే భారీగా ఓట్లు చీల్చే అవకాశం వుంటే అది తెలుగుదేశం పార్టీకి అనుకూలం అవుతుందని, ఈ మేరకు పూతలపుట్టు అసెంబ్లీ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఈ ఎన్నికల్లో పాగా వేస్తుందని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా

# కుప్పంపై జనం ఫోకస్ !!

## కుప్పంలో చంద్రబాబు మెజార్టీ..
## ఫలితాలపై ప్రజల్లో పెరిగిన హైప్ !!





తెదేపా అధినేత చంద్రబాబునాయుడు, ఎమ్మెల్సీ భరత్

కుప్పం, జూన్ 3 ప్రభాతవార్త సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు మరికొన్ని గంటల్లో ప్రారంభం అవుతోంది. దీంతో ఏ నోట వినా ౖ ఎన్నికల ఫలితాలపైనే ప్రధాన చర్చ జరుగుతోంది. ఎవరు ఏ స్థానంలో గెలుస్తారు వైకాపాకు ఎన్నిసీట్లు, తెదేపాకు ఎన్నిసీట్లు వస్తాయి.. ఏయే అభ్యరు ్థలకు ఏమేర మెజార్టీ వస్తుందోననే ఆతృత కనబరుస్తున్నారు. ముఖ్యంగా రాష్ట్రంలోనే హాట్ టాఫిక్ నియోజకవర్గాల్లో ఒకటైన కుప్పం అసెంబ్లీ స్థానం ఫలితంపైనే చాలావరకు దృష్టి సారి ంచి జనం ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రధానంగా కుప్పం నుంచి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు లక్ష ఓట్ల మెజార్టీ సాధనే లక్ష్యంగా ఎన్నికల బరిలో ఎనిమిదోసారి దిగారు. ఇక వైఎస్సార్సీ తరపున సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సన్నిహితుడు ఎమ్మెల్సీ భరత్ తొలిసారి అసెంబ్లీ ఎన్నికల్లో దిగారు. రాష్ట్ర వ్యాప్తంగా కుప్పం స్థానంపై భారీగా బెటి ్టంగులు సైతం జరుగుతున్నట్లు తెలిసింది. కుప్పంలో చంద్రబాబునాయుడుకు లభించే మెజార్టీపై అధిక శాతం మంది బెట్టింగులు కట్టినట్లు సమాచారం. మరో పక్క వైకాపా కూడా కుప్పంలో గెలుస్తుందని రాష్ట్రంలో పలుచోట్ల బెట్టింగులు సైతం జరిగాయని సమాచారం. కుప్పం అసెంబ్లీ బరిలో 13మంది అభ్యర్థులు బరిలో ఉండగా ప్రధాన పోటీ బాబు,భరత్‌ల మధ్యే. నియోజకవర్గంలో మొత్తం 2,25,775మంది ఓటర్లకు గాను 2,02920మంది తమ ఓటు హక్కును రాష్ట్రంలోనే అత్యధికంగా మూడోస్థానంలో నిలిచేలా 89.88శాతం మేర వినియోగించుకున్నారు. అలాగే సుమారు 1555 పోస్టల్, హోం, సర్వీసు ఓట్లు పోలయినట్లు సమాచారం.గతంలో కంటే ఐదుశాతం మేర పోలింగ పెరగడంపై ఇప్పుడు తీవ్ర ఉత్కంఠత నెలకొంది. కాగా సోమవారం సాయంత్రానికే నియోజకవర్గం నుంచి ప్రధాన పార్టీల తరపున కౌంటింగ్ ఏజెంట్లుగా నియమితులైన వారు, ఆయా పార్టీల ముఖ్య నేతలంతా చిత్తూరుకు బయలుదేరారు. గతంలో ఎన్నడూలేని విధంగా కుప్పంలో ఈసారి ఫలితాలపై భారీ హైప్ ఏర్పడడం గమనార్హం.

# పకడ్బందీగా ఓట్ల లెక్కింపు

## - నిష్పక్షపాతంగా విధుల నిర్వహణ
## - అనంతపురం రేంజ్ ఐజి కెవి మోహన్‌రావు ఆదేశం



ఓట్ల లెక్కింపు కేంద్రం ఎస్వీసెట్‌ను పరిశీలిస్తున్న అనంతపురం రేంజ్ ఐజి కెవి మోహన్‌నావు

చిత్తూరు, జూన్ 3 ప్రభాతవార్త: చిత్తూరు ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాల ఓట్ల లెక్కింపు కేంద్రంలో మంగళవారం జరుగనున్న ఓట్ల లెక్కింపును పకడ్బందీగా నిర్వర్తించడానికి పక్కా ఏర్పాట్లు చేపట్టాలని అనంతపురం రేంజ్ ఐజి, చిత్తూరు, తిరుపతి జిల్లాల కౌంటింగ్ ఇన్‌ఛార్జీ కెవి మోహన్‌రావు ఎస్పీ సగిలి షన్మోహన్‌ను ఆదేశించారు. చిత్తూరు ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాల ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఓట్ల లెక్కింపుపై చేపట్టిన ఏర్పాట్లను మంగళవారం అనంతపురం రేంజ్ ఐజి కెవి మోహన్‌రావు ఎస్పీ సగిలి షన్మోహన్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా చిత్తూరు, తిరుపతి జిల్లాల కౌంటింగ్ ఇన్‌ఛార్జీ కెవి మోహన్‌రావు మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు పారదర్శకంగా నిర్వర్తించడానికి కౌంటింగ్ కేంద్రాల్లో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం పోలీసులు కీలకంగా విధులు నిర్వర్తించాల్సి వుంటుందని, శాంతిభద్రతల సంరక్షణకు పోలీసు అధికారుల నుండి సిబ్బంది వరకు విధులకు క్రమశిక్షణతో నిర్వర్తించాలన్నారు. విధి నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే ఊపేక్షించేది లేదని హెచ్చరించారు. సిసి కెమెరాల పర్యవేక్షణ, సెక్యూరిటీ వ్యవస్థలను కఠినంగా అమలు చేయాలని, ఎన్నికల ప్రక్రియలో భద్రతకు ఎలాంటి విఘాతం కలుగకుండా చూడాలని ఎస్పీని ఆదేశించారు. శాంతిభద్రతల విషయంలో సెక్షన్ 144ను కఠినంగా అమలు చేయాలని, ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అనంతపురం ఐజి కెవి మోహన్‌రావు ఓట్ల లెక్కింపు కేంద్రం పరిసరాలు, పార్కింగ్ ప్రదేశాలు, ఓట్ల లెక్కింపు చేపట్టే గదులు, సిసి కెమెరాల పనితీరు, స్ట్రాంగ్ రూమ్స్, మీడియా, పాత్రికేయుల వెయిటింగ్ హాలు తదితరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఆరీఫుల్లా, ఏఆర్ ఎస్పీ జి.నాగేశ్వరరావు, టిటిసి డిఎస్పీ శ్రావణ్‌కుమార్, ఏఆర్ డిఎస్పీ ఇలియాజ్‌భాషా, ట్రైనింగ్ డిఎస్పీ పావన్‌కుమార్, ఆర్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# టోల్‌ప్లాజా వద్ద పోలీసు తనిఖీలు

## 29 మద్యం ఫుల్ బాటిళ్ళు, 2 కత్తులు స్వాధీనం : ఇన్‌చార్జ్ డిఎస్పీ జి.రవికుమార్

చంద్రగిరి, జూన్ 3 ప్రభాతవార్త: సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు నేపథ్యంలో చంద్రగిరి పొలిమేర పనపాకం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ డిఎస్పీ జి.రవికుమార్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసుల తనిఖీలో కర్నాటక, మంగళూరు నుండి టెంపోట్రావెలర్‌లో వస్తున్న 13 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి వాహనాన్ని తనిఖీ చేయగా 29 ఫుల్ మద్యం బాటిళ్ళు, 2 కత్తులు వున్నట్లు తెలిపారు. వీరిని విచారణ చేయగా కర్ణాటక, మంగళూరు హార్బర్‌లో కబీర్ సహకారంతో చేపలవేటకు పనిచేస్తున్నట్లు తెలిపారు. ఏడాదికి ఒకమారు, రెండేళ్ళకు ఒకమారు తమ సొంతూర్లుకు వెళతారని అన్నారు. ఇందులో భాగంగా 13 మంది టెంపోట్రావెలర్‌లో కర్ణాటక నుండి ఒంగోలు సమీపంలోని కొత్తసత్రంకు వెళుతున్నట్లు తెలిపారు. అక్రమంగా మద్యం తీసుకురావడంపై కేసులు నమోదుచేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐ రామయ్య పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపునకు ఆలస్యంగా వస్తే సస్పెన్షన్ వేటు

## - ఉదయం 6 గంటలకల్లా కౌంటింగ్ కేంద్రాలకు సిబ్బంది
## - జాయింట్ కలెక్టర్, చిత్తూరు నియోజకవర్గ ఆర్‌ఓ పి.శ్రీనివాసులు



చిత్తూరు, జూన్ 3 ప్రభాతవార్త: ఎన్నికల ఓట్ల లెక్కింపుకు సిబ్బంది ఎవరైనా ఆలస్యంగా వస్తే వారిని నిర్ధాక్షిణ్యంగా సస్పెన్షన్ చేస్తామని జాయింట్ కలెక్టర్, చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ ఆర్‌ఓ పి.శ్రీనివాసులు స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఎస్వీ సెట్ ఓట్ల లెక్కింపు కేంద్రంలో సోమవారం డిఆర్‌ఓ పుల్లయ్య, ఎఆర్‌ఓలు మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ, చిత్తూరు, గుడిపాల తహసిల్దార్లతో కలిసి ఓట్ల లెక్కింపు కేంద్రంలో విధులు నిర్వర్తించే కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ సూపర్‌వైజర్లు, సూక్ష్మ పరిశీలకులకు 2వ విడత నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మే 13న పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించిన తరహాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించి పూర్తి చేయాలన్నారు. ఇవిఎంఎస్ ద్వారా ఓట్ల లెక్కింపు టేబుల్స్ దగ్గరికి కంట్రోల్ యూనిట్, 17సి ని తెచ్చి ఇవ్వడం జరుగుతుందని, ముందుగా కంట్రోల్ యూనిట్ స్విచ్ అన్ చేసుకోవాలని, కంట్రోల్ యూనిట్‌లో 17సిలో వున్న సంఖ్య ఒక్కటిగా వుంటే ఎలాంటి సమస్య వుండదన్నారు. సియు ద్వారా ఓట్ల లెక్కింపుకు సంబంధించి అభ్యర్థులు ఏజెంట్లకు రెండు సార్లుగా ఫలితాలను వివరించాలన్నారు. కంట్రోల్ యూనిట్‌లో ఎదైనా ఇబ్బంది కలిగితే బెల్ ఇంజనీర్లు అందుబాటులో వుంటారని వారికి తెలియజేయాలన్నారు. ఎదైనా సమస్యలు ఇబ్బందులు వుంటే సత్వరం ఆర్‌ఓ దృష్టికి తీసుకెళ్ళాలని సూపర్‌వైజర్లను ఆదేశించారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుకు సంబంధించి అభ్యర్థులు, ఏజెంట్లకు చూపిస్తూ జాగ్రత్తగా లెక్కించాలని ఆదేశించారు. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు 14 టేబుల్స్ ద్వారా 17 రౌండ్లలో పూర్తవుతుందని, కౌంటింగ్ టేబుల్స్‌కు 19 మంది సూపర్‌వైజర్లు, 25 మంది అసిస్టెంట్ సూపర్‌వైజర్లు, 22 మంది సూక్ష్మపరిశీలకులు వుంటారన్నారు.

# రికార్డు స్థాయిలో రాహుకేతు పూజలు



శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిత్యకళ్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి,జూన్ 3 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం భక్తులు కిట కిట లాడారు.స్వామి అమ్మవార్లకు లెక్కనన్ని అభిషేకాలు నిర్వహించారు. అలాగే రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిగాయి. ఒక్కొక్క కాలం అభిషేకానికి కేవలం పది మందిని మాత్రమే అనుమతించాల్సి ఉండగా లెక్కలేనంత మందిని అనుమతిస్తున్నారు. ఆలయంలో స్వామి వార్లకు నిత్యకళ్యాణోత్సవంతో భక్తుల కోలాహలం చోటు చేసుకుంది. ఎండలు దడ పుట్టిస్తున్నా భక్తులు లెక్క చేయక స్వామి అమ్మవార్ల దర్శనాల కోసం నిరీక్షిస్తున్నారు.దేవస్థానం అధికారులు అందించిన సమాచారం మేరకు 30వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు సమాచారం.స్వామి అమ్మవార్లకు అభిషేకాలు 173 మంది జరిగాయి. మహాన్యస ఏకాదశ రుద్రాభిషేకాలు 53 శనీశ్వరాభిషేకాలు 15 జరిగాయి. కాగా రాహుకేతుదోష నివారణ పూజలు 4646 జరిగినట్లు సమాచారం. ఇక ప్రత్యేకాశీర్వచన ప్రవేశ టిక్కెట్లు 5091 కొనుగోలు చేసినట్లు సమాచారం.

### మధురానుభూతి:

ఆలయంలో ప్రవేశిస్తూనే ఎదురుగా చిన్మయముద్ర కల్గిన గురు దక్షిణామూర్తి దర్శనం లభిస్తుంది. ఇక ఎడమవైపును ఆకాశ గణపతి, ఆకాశ గంగ దర్శనం లభిస్తుంది. పక్కనే స్వామి అమ్మవార్ల విగ్రహాలను ఏర్పాటు చేసి నిత్య కళ్యాణం నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయంలోని స్వామి అమ్మవార్ల నిత్యకళ్యాణోత్సవానికి విశేష స్పందన వచ్చింది.గణపతి పూజలు, నవగ్రహ పూజలు, యజ్ఞోపవేత పూజలు, మాంగల్యధారణ కార్యక్రమూలు నిర్వహించారు.

### మృత్యుంజయినికిషోడషాభిషేకాలు:

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం ప్రత్యేకాభిషేకాలు,అలంకారాలు నిర్వహించారు. ఆలయంలో వారంలో ప్రతి రోజూ ఏదో ఉత్సవం నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి వైభవంగా పూజలు నిర్వహించారు.ఇక్కడి మృ త్యుంజయ స్వామి ఆలయంలో వర్షాభావంతో ఈ ప్రాంతాలు తల్లడిల్లు తున్నపుడు ఇక్కడ స్వామికి పూజలు నిర్వహించే వారు.ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో ఉన్నపుడు నివృత్తి కోసం పూజలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో సోమవారం శివయ్యకు ప్రీతిపాత్రమైన రోజు కాబట్టి షోడషాభిషేకాలు నిర్వహించారు.

## పలమనేరులో 144 సెక్షన్ అమలు

### -నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పదు-సిఐ

పలమనేరు, జూన్ 3,(ప్రభాతవార్త:



పలమనేరులో నేడు(ఈ నెల4)144 సెక్షన్ అమలులో ఉంటుందని సిఐ చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 4న ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా మండలంలో ఎటువంటి అవాంచనియ్య సంఘటనలు చోటు చేసుకోకుండా 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. జూన్ 6 వరకు ఎటువంటి ర్యాలీలు, ఊరేగింపులు చేయరాదని, బాణాసంచా కాల్చడం నిషేధమని 144 సెక్షన్ అమలు కారణంగా హోటల్లు, దుకాణాలు తీయరాదని, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా మండలంలో పోలీసు బందోబస్తుపై సిబ్బందికి అవగాహన కల్పించారు. రోడ్లపై ప్రజలు గుమికూడితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సత్య గంగమ్మ ఆలయ ఆదాయం రూ.86వేలు

పలమనేరు, జూన్ 3 ప్రభాతవార్త:

పలమనేరు సత్యగంగమ్మ ఆలయం హుండీ ఆదాయం రూ.86 వేలు వచ్చినట్లు జిల్లా దేవాదాయ శాఖ కార్యలయ అధికారి రాధిక తెలిపారు. సోమవారం ఆమె ఆధ్వర్యంలో స్థానిక సత్య గంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు నిర్వహించారు. ఈ మేరకు ఆలయ హుండీ ఆదాయం రూ.86,702 వచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జిల్లా తెలుగుదేశం కార్యదర్శి వాసు జన్మదినం

పాలసముద్రం, జూన్ 3 ప్రభాతవార్త:



జిల్లా తెలుగుదేశం కార్యదర్శి వాసు వేడుకలు పాల సముద్రం మండలం బలిజకండ్రిగలోని ఆయన నివాసంలో సోమవారం ఘనంగా నిర్వ హించారు. ఈ వేడుకలకు రాష్ట్ర తెలుగుదేశం కార్య నిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబునాయుడు హాజరై వాసుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు. జిడినెల్లూరు నియోజకవర్గ పరిధిలోని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు హాజరై వాసుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. పుట్టిన రోజు కేక్‌ను వాసు కట్ చేసి అందరికి తినిపించారు.

## రేపటి వరకు మద్యం దుకాణాలు బంద్

చిత్తూరు, జూన్ 3 ప్రభాతవార్త:

సార్వత్రిక ఎన్నికలు-2024 ఓట్ల లెక్కింపు పురస్కరించుకుని ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల పాటు మద్యం దుకాణాలు మూని వేస్తున్నట్లు జిల్లా మద్యనిషేధ, అంబార్కీ శాఖ అధికారి షేక్ అయిషాబేగం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని డిస్టిలరీలు, బ్రేవరీస్, ఎపిఎస్‌బిసిఎల్ డిపో, ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లు, క్లబ్‌లు, టూరిజం బార్లు, మిలటరీ క్యాంటీన్, కల్లు దుకాణాలు, లైసెన్స్ కలిగిన అన్ని మద్యం దుకాణాలు 3వ తేదీ నుండి 5వ తేదీ వరకు డ్రైడేగా పాటించి మూసి వేస్తున్నట్లు ఆమె తెలిపారు.

## 3 కేజీల గంజాయి స్వాధీనం

### - ఒకరు అరెస్టు

చిత్తూరు, జూన్ 3 ప్రభాతవార్త:

చిత్తూరు టుటౌన్ పోలీసులు మంగళవారం తెల్లవారుజాము వీరభద్రకాలనీ నీవానది గట్టు వద్ద దాడులు నిర్వహించి జి.షణ్ముగం(32)ను అరెస్టు చేసి అతని నుండి 50 వేల రూపాయల విలువైన 3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. టుటౌన్ ఇన్స్‌పెక్టర్ ఉలసయ్య వెల్లడించిన వివరాల వీరభద్రకాలనీ నీవా నది పరిసరాల్లో గంజాయి విక్రయాలు జరుగుతుందని డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డికి అందని సమాచారం రావడంతో తానతో పాటు టుటౌన్ ఎస్ఐ ఇక్బాల్ సిబ్బంది కలసి దాడి చేయడం జరిగిందన్నారు. ఈ దాడిలో జి.షణ్ముగం పట్టుబడటంతో అతన్ని విచారించగా సులభంగా డబ్బులు సంపాదన కోసం ఆంధ్ర-ఓడిస్సా సరిహద్దు నుండి గంజాయిని అక్రమంగా కొనుగోలు చేసి చిత్తూరుకు సరఫరా చేసి ఇక్కడ యువతకు అధిక రేట్లకు అమ్మకాలు సాగిస్తున్నాడని తెలిపారు. ఈ మేరకు షణ్ముగంను అరెస్టు చేసి కోర్టు ఎదుట హాజరు పరచి రిమాండ్‌కు తరలించడం జరిగిందని టుటౌన్ ఇన్స్‌పెక్టర్ ఉలసయ్య తెలిపారు.

## మంత్రి పెద్దిరెడ్డిని కలసిన కొండవీటి

పుంగనూరు, జూన్ 3 ప్రభాతవార్త:



ఎన్నికల ఫలితాలకు గంటల వ్యవధి మాత్రమే ఉన్న తరుణంలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచం ద్రారెడ్డిని, ఎంపి మిధున్‌రెడ్డిలను రాష్ట్రజానపద కళల అకాడమీ ఛైర్మన్ కొండవీటి నాగభూష ణం, బోయకొండ ఆలయ కమిటీ సభ్యుడు రాజేష్‌లు కలసి ముందస్తు అభినందనలు తెలియచే శారు. ఈమేరకు మంత్రిని కలసిన కొండవీటి, రాజేష్‌లుతో పాటూ కుప్పం పరిశీలకులు బైరెడ్డిపల్లి రెడ్డెప్పలు జిల్లాతో పాటూ రాష్ట్రంలో మరోసారి విజయభేరి మోగించనున్న పార్టీ పరిస్థితులను సమీక్షించారు. ఎన్నికల ఫలితాల సందర్భంగా పార్టీనాయకులు, కార్యకర్తలు, ప్రజలు సంయమనం పాటించాలని మంత్రి పెద్దిరెడ్డి పేర్కొన్నారని, తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు విజయోత్స వాలకు దూరంగా ఉండాలని సూచించినట్లు తెలిసింది.

## వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

పుంగనూరు, జూన్ 3 ప్రభాతవార్త:

పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో మున్సిపల్ బస్టాండు వద్ద సోమవారం మధ్యాహ్నం బెంగళూరుకు వెళ్ళే ప్రైవేట్ బస్సులో వృద్ధురాలు మెడలో 58గ్రాముల బంగారు నగను ఇద్దరు మహిళలు సినీఫక్కీలో చోరీచేశారు. వివరాలిలా ఉన్నాయి. మండలానికి చెందిన పద్మావతమ్మ సోమవారం మధ్యాహ్నం మున్సిపల్ బస్టాండుకు వచ్చి బెంగళూరు బస్సు ఎక్కేందుకు ప్రయత్నించింది. ఈసందర్భంలో ఆమె వెనుకనే ఉన్న ఒక మహిళ తన బ్యాగును అడ్డుపెట్టి పద్మావతమ్మ గొంతులోని గొలుసును సునాయాసంగా తస్కరించి పారిపోయింది. ఇదే సందర్భంలో చోరీ విషయాన్ని గమనించిన పద్మావతమ్మ పెద్దగా కేకలు పెట్టినా ఫలితం లేకపోయింది. అప్పటికే చోరీచేసిన వారు పరారయ్యారు. ఈసంఘటనలో ఇద్దరు మహిళలు ఉన్నట్లు బస్సులోని సిసి కెమెరాల ద్వారా గుర్తించబడింది. పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు.

## చౌడేపల్లిలో స్వచ్ఛంద బంద్‌కు సహకరించండి : ఎస్ఐ

చౌడేపల్లి, జూన్ 3 ప్రభాతవార్త



మండల కేంద్రమైన చౌడేపల్లిలో దుకాణదారులు మంగళవారం స్వచ్ఛంద బంద్‌కు సహకరించాలని ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కోరారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు దృష్ట్యా మండలంలో 144, సెక్షన్ 30ఆక్ట్ అమలులో వుంటుంద న్నారు. కౌంటింగ్ ఫలితాలు వెలువడే క్రమంలో సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదన్నారు. ఒక గ్రామానికి చెందిన వ్యక్తి మరొక గ్రామంలో వుండరాదన్నారు. 3నుంచి 5వరకు మద్యం విక్రయించరాదన్నారు. విజయోత్స వాలు, ర్యాలీలు, టపాకాయలు పేల్చడం వంటివి నిషేదమన్నారు. ఎవరైనా వ్యతిరేక చర్యలకు పాల్పడితే చట్టపరంగా శిక్షలుంటాయన్నారు.

## ఏ నోట విన్నా కౌంటింగ్ మాటే...!

### -ఇరుపార్టీల్లోనూ గెలుపు ధీమా

చౌడేపల్లి, జూన్ 3 ప్రభాతవార్త

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు నేడు తెరపడనుంది. దీంతో ఏ నోట విన్నా కౌంటింగ్ మాటలే వినిపిస్తున్నాయి. రాజకీయ పార్టీలన్నీ గెలుపు ధీమాలో వున్నాయి. ఇటీవల వెలువడిన ఎగ్జిట్‌ఫోల్స్‌ను గురించి సర్వత్రా చర్చించుకొం టున్నరు. అదే తరహాలు బెట్టింగ్‌లు ఊపందుకొం టున్నాయి. ముఖ్యంగా పుంగనూరులో బరిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కూటమి అభ్యర్థి తేదేపా నుంచి చల్లా రామచంద్రారెడ్డి, బిసివై పార్టీ నుంచి బోడే రామచంద్రయాదవ్, కాంగ్రెస్, బిఎస్‌పి, ఎస్‌డిపిఐపార్టీలకు చెందిన అభ్యర్థులు వున్నారు. ఈనెల 13న అందరి భవితవ్యాన్ని ఓటర్లు ఇవిఎంలలో భద్రపరచారు. ఈనెల 4న చిత్తూరు ఎస్‌విసెట్ కళాశాల నందు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. దీంతో అందరిలో ఉత్కంఠ నెలకొనింది. మండల వ్యాప్తంగా ఎక్కడ విన్నా ఓట్ల లెక్కింపు మాటలు వినిపిస్తున్నాయి. పుంగనూరులో తేదేపా, వైకాపా మద్యనే పోటీ వుండటంతో వీరిద్దరిలో ఎవరు గెలుస్తారు...ఎవరికెన్ని ఓట్లు పడ్డాయి అన్న అంశంపైనే చర్చలు జరుగుతున్నాయి.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రభుత్వం నిర్ణయం మేరకే ప్రైవేటు స్కూల్లో ఫీజులు

### ఎంఈఓ బాబ్జి

పాకాల, జూన్ 3, ప్రభాతవార్త



ప్రభుత్వం నిర్ణయించిన మేరకే విద్యార్థుల దగ్గర నుండి ఫీజులు వసూళ్ల చేయాలని తిరుపతి జిల్లా పాకాల మండలం విద్యా శాఖాధికారి బాబ్జి అన్నారు. ఆయన సోమవారం మండలంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఆయా పాఠశాలలు ప్రభుత్వం నిర్ణయించిన మేరకే ఫీజులు వసూళ్ల చేయాలని కోరారు. ఫీజులు వివరాలను పాఠశాల నోటీస్ బోర్డ్ నందు నమోదు చేయాలని అన్నారు. అదే విధంగా పాఠశాలలో నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్ ఉంచరాదు, అమ్మరాదని, పిల్లలపై బుక్కుల భారాన్ని తగ్గేలా చూడాలని అన్నారు. ఇష్టం వచ్చినట్లు పాఠశాలల పేర్లు మార్చే అధికారం మనకు లేదని అన్నారు. అలా పేరు మార్చాలనుకుంటే జిల్లా కమిటీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రతి నెల ఏదో ఒక వారంలో కమిటీ సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులతో ప్రతి నెల ఏదో ఒక వారంలో కమిటీ సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు తెలియచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు : సిఐ

పాకాల, జూన్ 3, ప్రభాతవార్త



సాధారణ ఎన్నికలు 2024 కౌంటింగ్ సందర్భంగా నేడు పాకాల మండలంలోని అన్ని గ్రామాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని సిఐ రాజగోపాల్ తెలిపారు. ప్రజలు ఎవ్వరు కూడా గుంపులు గుంపులుగా ఉండడం, బాణసంచా కాల్చడం, వీధుల వెంట గెలుపు సంబరాలను చేసుకోవడం, రంగులు చల్లుకోవడం, సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టడం వంటివి పూర్తిగా నిషేధించడమైనదని, అందు వల్ల పాకాల, పరిసర గ్రామ ప్రజలు పోలీస్ వారి సూచనను గమనించి పోలీస్ వారికి సహకరించాలని కోరారు. శాంతిభద్రతకు విఘాతం కలిగిస్తే కఠినమైన చర్యలు చేపడతా మని హెచ్చరించారు. పాకాల మండలం ఎస్ఐ మహేష్ బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

కాణిపాకం, జూన్ 3 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన అఖిల్‌రెడ్డి అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 1,11,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని దాత కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్‌లకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## శివాలయంలో ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, జున్ 3 ప్రభాతవార్త :



మండల కేంద్రం సమీపంలోని చవటగుంట వద్ద వేలసిన ఆవు దేవర నందీశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పురోహితులు వివిధ అభిషేకా పూజలు నిర్వహించి స్వామివారిని పట్టు వస్త్రలు, ఆభరణాలు, పూలతో అలంకరణ చేశారు. వేద మంత్రాల నడుమ పూజలు చేపట్టిన తరువాత ఆలయంకు విచ్చేసిన భక్తులకు దైవ దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రత్యేక పూజలకు సొద వెంకటరమణా రెడ్డిలు ఉభయదతాలుగా వ్యవహారించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు రాధాకృష్ణారెడ్డి, పండితులు రవి శర్మ, పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## క్రాస్ ఓట్లపైనే అందరి దృష్టి

తడ, జూన్ 3 ప్రభాతవార్త

సార్వత్రిక ఎన్నికల్లో ఈ సారి క్రాస్ ఓటింగ్ ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని పలువురు అంటున్నారు. ఒకేసారి పార్లమెంటు, అసెంబ్లీలకు ఎన్నికలు జరగడంతో క్రాస్ ఓటింగ్ ప్రభావం ఎక్కువగా ఉందని చెబుతున్నారు. ముఖ్యంగా తిరుపతి పార్లమెంటు పరిధిలో క్రాస్ ఓటింగ్ భయం ముచ్చటగా మూడు పార్టీలలో నెలకొంది. ఇక్కడ పార్లమెంటుకు భారతీయ జనతా పార్టీ అభ్యర్థి వి.వరప్రసాదరావు పోటీ చేస్తుండగా, వైసీపీ తరపున మద్దెల గురుమూర్తి బరిలో దిగారు. ఒక్క తిరుపతి తప్ప మిగిలిన ఆరు నియోజకవర్గాలలో కూటమి తరపున తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు నిలిచారు. తిరుపతిలో జనసేన పార్టీ ఆరణి శ్రీనివాసులును నిలబెట్టింది. తిరుపతి పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో వైసీపీ అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. ఇదిలావుంటే ఈ సారి రెండు ఇవిఎంలలో తాము అనుకున్న గుర్తు కనిపించకపోవడంతో కొందరు కూటమి ఓటర్లు తికమకపడ్డారు. అయితే వైసీపీ కూడా ఈ ఇబ్బందులను ఎదుర్కొంది. రెండు చోట్లా డబ్బులు తీసుకున్న ఓటర్లు చెరొక గుర్తుకు వేయాలని వెళితే అక్కడ మొదట పార్లమెంటు ఇవిఎంలో సైకిల్ కనిపించలేదని, దీనితో ఎక్కువమంది కమలం గుర్తుకు ఓటేశారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వైసీపీ అసెంబ్లీ అభ్యర్థులకు కాకుండా రెండవ ఓటును సైకిల్‌కు వేసినట్లు అనుమానాలు ఉన్నాయి. దీనికితోడు కూటమి అభ్యర్థులు, వైసీపీ అభ్యర్థులు కూడా అసమ్మతులను ఎదుర్కొన్నారు. ఈ కారణంగా క్రాస్ ఓటింగ్ జరిగి ఉంటే ఎవరికి నష్టమన్న దానిపై లెక్కలు వేసుకుంటున్నారు. సూళ్లూరుపేట ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలో ఎన్నికల ఫలితాలు మరికొద్దిసేపట్లో వస్తున్నప్పటికీ ఏప గ్రామాల్లో ముఖ్యంగా నేతలుగా చెప్పుకునే వారి గ్రామాల్లో ఆయా పార్టీలకు ఎన్ని ఓట్లు పడ్డాయన్నది తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం ఇవిఎంలు తెరవడమే !

## వైసిపికి 151 యొక్క సీట్లు కన్నా మించి వస్తాయి

### జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

వెంకటగిరి టౌన్, జూన్ 3, ప్రభాతవార్త



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి గతంలో వచ్చిన 151 యొక్క సీట్లు కన్నా మించి వస్తాయని వైసిపి జిల్లా అధ్యక్షులు, అభ్యర్థి నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో తిరుపతి జిల్లా సంబంధిం చిన ఓట్లు లెక్కింపు ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. వైఎస్ఆర్‌సిపి పార్టీ ఎవరిని ప్రలోభాలకు గురి చేయలేదని మా పార్టీ చేసిన సంక్షేమ పథకాలను పొందిన ప్రజలు ఓటేశారని మేము గట్టిగా నమ్ముతున్నామని చెప్పారు. అదే తెలుగుదేశం పార్టీ ఏ విధంగా చెప్పిస్తుందో అందరికీ తెలిసిందే అని చెప్పారు. ఇవన్నీ పక్కన పెడితే 6వ తేది నుండి వర్షం వస్తాయని చెప్పారు. కానీ 4వ తేది ముందే రుతుపవనాలు వచ్చాయని, దీన్ని బట్టి జగన్ మోహన్ రెడ్డి సిఎం అవుతారని స్పష్టమైన తీర్పు వచ్చిందని తెలిపారు. ఈ నెల 9న విశాఖపట్నంలో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని చెప్పారు. తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదు. ప్రజలుకు ఎటువంటి సేవ చేయలేదు కాబట్టి 2019 సంవత్సరంలో జగన్మోహన్ రెడ్డిని అత్యధిక మెజారిటీ గెలిపించారని చెప్పారు. గెలిచిన వెంటనే ఇచ్చిన ప్రతి హామీను నెరవేర్చారు. అందువల్ల అప్పుడు151సీట్లుఇచ్చారని ఈ సారి కూడా దానికంటే ఎక్కువ సీట్లు ఇస్తారని నమ్ముతున్నామని చెప్పారు.

## అందరి దృష్టి పోస్టల్ బ్యాలెట్‌పైనే

### - వైసీపీలో ఇదే గుబులు

కోట, జూన్ 3 ప్రభాతవార్త

సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపు సమయం దగ్గరపడే కొద్దీ అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొనగా, ఇవిఎంల ద్వారా పడిన ఓట్ల కంటే ఉద్యోగ, ఉపాధ్యాయులు వేసిన పోస్టల్ బ్యాలెట్ మరింత కాకరేపుతున్నాయి. జిల్లాలోని 7 నియోజకవర్గాల స్థానాల్లో గెలుపోటములపై బ్యాలెట్ ఓట్లు ప్రభావం చూపే అవకాశం ఉండటంతో అందరి దృష్టి వీటిపైనే ఉంది. ఇటీవల కాలంలో ఏ ఎన్నికల్లోను లేని విధంగా ఈ సారి ఉద్యోగులు, ఉపాధ్యాయుల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు అత్యధికంగా పోలయ్యాయి. దీంతో వైసీపీ అభ్యర్థుల్లో గుబులు రేపుతోంది. తమకు ఏ మాత్రం వేశారన్న ఆందోళన వారిలో నెలకొంది. కారణం.. మెరుగైన పిఆర్‌సి, డిఎల చెల్లింపు, సిపిఎస్ రద్దు వంటి హామీలను నెరవేర్చడంలో వైసీపీ అధినేత జగన్‌మోమన్‌రెడ్డి విఫలమయ్యారు. పైగా ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉద్యోగులు, ఉపాధ్యాయులను ముప్పతిప్పలు పెట్టారు. వారి ఆర్థిక ప్రయోజనాలపై దెబ్బకొట్టారు. ఈ అసంతృప్తే వారిలో కసి పెంచి భారీగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేసేందుకు కారణమైందని పలువురు అంటున్నారు.

## నరసింహస్వామి ఆలయంలో కురుగొండ్ల రామకృష్ణ పూజలు

వెంకటగిరి టౌన్, జూన్ 3, ప్రభాతవార్త



పెంచలకోన నందు శ్రీశ్రీశ్రీ పెనుశీల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నందు మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనను ఆశీర్వదించారు. కురుగొండ్లకు తీర్థప్రసాదాలను అందజే శారు. అనంతరం తిరుమలకి వెళ్లి మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ స్వామి వారిని దర్శించుకున్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి విజయమని తెలిపారు. చంద్రబాబు నాయుడు సిఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పారు. తాను కూడా భారీ మెజారిటీతో గెలుస్తానని వ్యక్తం చేశారు. ఆయనతో పాటు పెంచలకోన దేవస్థాన ట్రస్ట్ బోర్డు మాజీ ఛైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యులు పీర్ల సోమయ్య, రాపూరు మండల నాయకులు, నలవడ్ల వెంకటరమణ రెడ్డి, మధుసూధన్ రెడ్డి, నియోజకవర్గ రైతు ప్రధాన కార్యదర్శి బొమ్మిరెడ్డి రవీంద్ర రెడ్డి, సైదాపురం నాయకులు కాపా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఐఎఫ్ఇఎ అవార్డుకు ఏపిఆర్జేసీ లెక్చరర్ వారణాసి దుర్గాప్రసాద్ ఎంపిక

వెంకటగిరి టౌన్, జూన్ 3, ప్రభాతవార్త



పర్యావరణ పరిరక్షణకై ఐకానిక్ ఫెసిలిటేషన్ ఆఫ్ ఎక్స మప్లరీ అచీవ్మెంట్ అవార్డుకు ఏపీఆర్జేసీ తెలుగు లెక్చరర్ వారణాసి దుర్గాప్రసాద్ ఎంపికయ్యారు. 2024వ సంవత్సరం గాను ఈ అవార్డును ఆగస్టు నెల 17వ తేదీ ఢిల్లీలో ఆయన అందుకోనున్నారు. పర్యావరణలో భాగంగా నీరు గాలి పరిసరాలు చెట్ల పరిరక్షణ వర్షపు నీరు రిచార్జింగు తదితర వాటిపై ఆయన అంశాలపై ప్రాజెక్టు ప్రయోగాల పరిశోధనలు పాఠశాల విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. 400 పేజీల నివేదికను ఆయన సిపిఏఆర్‌కు నివేదించారు. ఈ నెల 5వ తేదీ జరుపుకునే ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఐకానిక్ వారు అవార్డుకు ఎంపిక చేశారు. వారణాసి దుర్గాప్రసాద్‌ను పలువురు అభినందించారు.

## ఘనంగా పాశిం సునీల్ కుమార్ జన్మదిన వేడుకులు

గూడూరు, జూన్ 2, ప్రభాతవార్త




నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ గూడూరు నియోజకవర్గం అభివృద్ధిని కోరకు పనిచేసే పాశిం కుమార్ మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఉన్నత పదవులు పొందాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ రెడ్డి కోరారు. గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మెప్మా పునరావస కేంద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర రాజు, శివకుమార్, నరసింహులు నాయుడు, వెంకటేష్, శ్రీధర్, కల్పనా, భారతి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం బాటిళ్లు పట్టివేత

కోట, జూన్ 3 ప్రభాతవార్త

ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మూడురోజుల పాటు మద్యం షాపులను మూసేశారు. ఈ నేపథ్యంలో సోమవారం కోటలో గుర్రం పెంచలయ్య, వెంకటకృష్ణయ్య అనే వారు 18 మద్యం బాటిళ్లను అక్రమంగా తీసుకెళుతుండగా వాకాడు ఎస్ఇబి సిఐ దేవర శ్రీనివాసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. రెండురోజుల పాటు ఎవరైనా అక్రమంగా మద్యం తీసుకెళ్లినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఎవరైనా ఘర్షణలు పడితే కఠిన చర్యలు ...

నాయుడుపేట టౌన్, జూన్ 3 ప్రభాతవార్త:

నేడు సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడునుండటంతో నాయుడుపేట మండలంలో 144సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎవరైనా మద్యం సేవించి ఘర్షణలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని నాయుడుపేట సిఐ శ్రీనివాసులురెడ్డి సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం నుండి సాంత్రం వరకు రౌడిషీటర్లును ముందస్తూ అరెస్టులు చేయడం జరుగుతుందన్నారు. నాయుడుపేట మండలంలో ఎక్కడ నలుగురు అంతకంటే ఎక్కువ మంది జనాభా గుమికూడటం అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నాయుడుపేట పట్టణం-మండలంలో సమస్యత్మక గ్రామాలు విన్నమాల, బీమవరం, గుర్తించి పోలీస్ పికెట్ ఏరా ్పటు చేశామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటుచేసి ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు ...సిఐ

దొరవారిసత్రం మే 3 ప్రభాతవార్త;

నాయుడుపేట సర్కిల్ పరిధిలోని దొరవారిసత్రం-పెళ్ళకూరు-ఓజిలి మండలాల్లో సమస్యాత్మక గ్రామాలను గుర్తించి పోలీస్ పికెట్ ఏర్పాటు చేయడం జరిగిందని నాయుడుపేట రూరల్ సిఐ జగన్‌మోహన్‌రావు సోమవారం తెలిపారు. అనంతరం ఆయన దొరవారిసత్రం మండలంలోని శింగనాల్లూరు, తనయాలి గ్రామంలో పర్యటించారు. ఆయన మాట్లడుతూ మంగళవార ం సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో 144సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. గ్రామాల్లో రౌటిషీటర్లును గుర్తించి ముందస్తూగా అరెస్టులు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో జనాభా గుమికూడరాదన్నారు. ఊరేగింపులు, టపాసులు పేల్చడం, ర్యాలీలకు అనుమతి లేదన్నారు. ప్రజలు గ్రామాల్లో కలిసిమెలసి స్నేహభావంతో ఉండాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## ఎగ్జిట్ పోల్స్‌కు మించి కూటమి విజయం

కోట, జూన్ 3 ప్రభాతవార్త

ఐదేళ్లుగా రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాలకు నేటి ఫలితాలతో మోక్షం లభించబోతోందని తెదేపా తిరుపతి జిల్లా కార్యదర్శి తూపిలి రాధకృష్ణారెడ్డి అన్నారు. ఆయన సోమవారం కోటలో విలేకర్లతో మాట్లాడుతూ త్వరగా ఈ ప్రభుత్వాన్ని తరమివేయాలనే కసి ప్రజల్లో కనిపించిందన్నారు. ఎగ్జిట్ పోల్ సర్వేలన్నీ ఏకపక్షంగా కూటమిదే విజయం అని చెప్పాయన్నారు. ఓటేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా బస్సులు, రైళ్లలో ప్రజలు వచ్చారన్నారు. అత్యధికంగా పోలింగ్ శాతం నమోదు కావడం ప్రజల నాడికి సంకేతికం అన్నారు, గూడూరు నియోజకవర్గంలో తెదేపా అభ్యర్థి పాశిం సునిల్ కుమార్ 25 వేలు కు పైగా మోజారీటితో విజయం సాధించిబోతున్నారని ఆయన చెప్పారు.

## చెరువును తలపిస్తున్న కెజిఎఫ్ రోడ్డు

శాంతిపురం, జూన్ 3 ప్రభాతవార్త



మండల కేంద్రమైన శాంతిపురంలోని కెజిఎఫ్ రోడ్డు కొద్దిపాటి వర్షానికే చెరువును తలపిస్తోంది. నిత్యం ఈ రోడ్డు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అయితే రోడ్డులో గుంతలు ఏర్పడడం, మరో పక్క రోడ్డుకు ఇరువైపులా ఉన్న వంకను ఆక్రమించడంతో నీరు వంకలోకి వెళ్లకుండా గుంతల్లోనే నిల్వ ఉండిపోతోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## శాంతిపురంలో షాపులు తీయరాదు : ఎస్ఐ

శాంతిపురం, జూన్ 3 ప్రభాతవార్త

మంగళవారం ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా శాంతిపురంలో ఎలాంటి షాపులు తెరవరాదని ఎస్సై సుమన్ ఆటో ద్వారా ప్రచారం చేయించారు. ప్రజలు ఎక్కడా గుమికూడరాదని మండల కేంద్రంలో అన్ని దుకాణాలు మూసివేసి పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

## సర్పంచ్‌చే మంచినీటి సమస్య పరిష్కారం

రామకుప్పం, జూన్ 3 ప్రభాతవార్త



మండలంలోని బందార్లపల్లి పంచాయతీ బోయనపల్లి గ్రామంలో మంచినీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. గ్రామంలోని బోరులో నీరు అడుగంటాయి. విషయం తెలుసుకున్న సర్పంచ్ రాజగోపాల్ గ్రామంలో కొత్తగా బోరు డ్రిల్ చేయించగా నీరు పుష్కలంగా లభించింది. బోరుకు మోటారు అమర్చి నీటి సౌకర్యం కల్పించిన సర్పంచ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# తిరుపతి డివిజన్

## దివ్యాంగులకు భరోసా భవిత కేంద్రాలు



తొట్టంబేడు, జూన్ 3 ప్రభాతవార్త : దివ్యాంగులకు భవిత కేంద్రాలు భరోసానిస్తాయని ఐ ఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి మరియు ప్లానింగ్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డిలు అన్నారు. సోమవారం తొట్టంబేడు మండలంలోని చిలకావారికండ్రిగలో ఐఈఆర్‌టిలు నిర్వహిస్తున్న సర్వేని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా ఐఈ కోఆర్డినేటర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలును గుర్తించి భవిత కేంద్రాల్లో చేరుస్తున్నట్లు తెలిపారు. భవిత కేంద్రాల్లో దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ ద్వారా విద్యనభ్యసించే విధంగా ప్రత్యేక ప్రతిభావంతులను ప్రోత్సహిస్తూ వారితో ప్రత్యేక సామర్ధ్యాన్ని బయటకు తీసుకువచ్చి సాధారణ విద్యార్థిలా వారి దైనిందిక జీవితంలో కార్యక్రమాలను నిర్వహించు కునేటట్లు చేస్తూ ఇతరులపై ఆధారపడకుండా వారి యొక్క జీవన నైపుణ్యాన్ని ముందుకు సాగించుకునే విధంగా నేర్పించి తల్లిదండ్రుల్లో మానసిక ధైర్యాన్ని నింపి వారికి భరోసా కల్పిస్తున్నదే ఈ భవిత కేంద్రాలన్నారు. ఇక్కడ ఫిజియోథెరఫీతో పాటు వారికి అవసరమైన పరికరాలను అందిస్తున్నట్లు తెలిపారు. బడికి వచ్చే విద్యార్థులకు రవాణా ఖర్చులు, హోంబెస్ట్ అలవెన్స్, ఎస్మార్ట్ అలవెన్స్ ప్రభుత్వం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్టీలు చైతన్య మరియు నాగరాజులు పాల్గొన్నారు.

## కపీంద్రునికి కనకాంబరాల అభిషేకం

**తిరుమల,జూన్ 3ప్రభాతవార్తప్రతినిధి:**





తిరుమల అంజనాద్రిలోని బాలాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ప్రీతిపాత్రమైన కనకంబారం, సిందూర వర్ణగన్నేరి పుష్పాలతో విశేష సహస్రనామార్చన నిర్వహించారు. హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా మూడవరోజు సోమవారం ఉదయం స్వామివారికి విశేషంగా అభిషేకాలు జరిపించారు. భక్తులకు దర్శనం కల్పించారు. కాగా సకలశుభాలకు మూలం ఆంజనేయస్వామి ఉపాసన అని పండితులు పేర్కొన్నారు. హనుమద్ జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం తిరుమలలో స్వరూపానందగిరి స్వామిఅనుగ్రహభాషణం చేశారు .స్వామివారి జీవిత విశేషాలు వివరించారు.





**సోమవారం తిరుపతి జిల్లా కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లును పర్యవేక్షించిన జిల్లా ఎస్పీ వి,హర్షవర్ధన్ రాజు, జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్‌లు**

**ప్రభాతవార్త, తిరుపతి**

## సమాధులకు లేదు పట్టు-కట్టకు పొంచి ఉన్న ముప్పు

**-శవాలను తవ్వేసి ఇసుక వ్యాపారాలు**



సమాధులను సైతం పెకలించిన దృశ్యం-తవ్వకాల్లో బయపడిన మృతదేహాల పుర్రెలు

శివయ్యను దర్శించుకుంటుంటారు. అయితే ఇక్కడ శ్మశానవాటిల్లో ఉన్న శవాలను సైతం ఇసుకాసురులు యదేచ్ఛగా తవ్వేసి ఇసుక వ్యాపారాలు చేసుకుంటూ జేబులు నింపుకుంటున్నారు. పూడ్చిన శవాలను సైతం పక్కకు తొలగించి ఇసుక వ్యాపారాలు చేసుకోవడం శోచనీయం. బతికున్నరోజుల్లో కనీసం మనశ్శాంతిగా లేని వారు మృతిచెందాక కుటుంబసభ్యులు స్వర్ణముఖి నదిలో సమాధులను తొలగించి అక్కడ నుంచి ఎడ్లబండ్లపై ఇసుకను యదేచ్ఛగా తోలుకుంటూ జేబులు నింపుకుంటున్నారు.

తొట్టంబేడు, జూన్ 3 ప్రభాతవార్త : ఇసుకాసురులకు స్వర్ణముఖిలోని శ్మశానం ఓవరంగా మారింది. ఇసుకాసురులు పురాతన కాలంనాటి ఆనకట్టను స్మశానంలోని సమాధులను సైతం చివరకు శవాలను కూడా వదలిపెట్టడం లేదు. ఇటు ఇరిగేషన్ అధికారులు స్వర్ణముఖిని కాపాడాలన్న ధ్యాసలేకపోగా ఇసుక అక్రమరవాణాను అరికట్టాలన్న చిత్తశుద్ది రెవెన్యూ అధికారులకు కానీ పోలీసులకు కానీ లేకపోవడం శోచనీయం. స్వర్ణముఖిని కొల్లగొట్టి ఇసుకాసురులు జేబులునింపుకుంటుంటే వారికి రాజకీయ నాయకులు మద్దతు అంటూ అధికారులు ప్రేక్షకపాత్ర వహించడం వారి చిత్తశుద్ధికి నిదర్శనం. శ్రీకాళ హస్తిలో అడుగుపెడితేనే కాశీలో అడుగుపెట్టినంత మోక్షమని చెబుతారు. ఇక్కడ శివుడు వాయులింగేశ్వరుడుగా స్వయంభువుగా వెలశాడు. రోజుకు 30వేలమందికి పైగా భక్తులు

మృతిచెందాక సమాధుల్లోనైనా ప్రశాంతంగా ఆత్మలు ఉంటామనుకుంటే సమాధులను పెకలించి ఇసుక వ్యాపారాలు చేయడం శోచనీయం. కుందేటివారి వీధి నుంచి శ్మశానానికి వెళ్ళేందుకు దారి ఉంది. ఈప్రాంతంలో ఎవ్వరు మృతిచెందినా ఇక్కడి స్మశానవాటికలో దహనక్రియలు, పూడ్చడం వంటి కార్యక్రమాలుచేపట్టడంతోపాటు కర్మక్రియలు చేసుకుంటారు. అయితే ఇక్కడ సమాధులును పెకలించడంతో పాటు శవాలను సైతం తొలగించి వ్యాపారాలు చేసుకోవడం శోచనీయం. శ్రీకాళహస్తిలో పవిత్ర స్వర్ణముఖినదిలో ఉన్న ఇసుకను దోచుకుంటున్నారు. కళ్ళముందే శవాలను సైతం తొలగించి ఇసుకను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా చర్యలుతీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## వ్యవసాయ డిప్లొమా కోర్సుకు నోటిఫికేషన్ విడుదల



తిరుపతి విద్య, జూన్ 3 ప్రభాతవార్త : ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించే వ్యవసాయ డిప్లొమా కోర్సులకు నోటిఫికేషన్ విడుదలైనట్లు తిరుపతి వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డా.సి. రమణ తెలిపారు. ఈ కోర్సులో చేరేందుకు పదో తరగతి విద్యార్హత అని తెలిపారు. ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 2024 ఆగస్ట్ 31 నాటికి 15 నుంచి 22 సంవత్సరాలు మధ్య వయసు కలిగి ఉండాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ఇంగ్లీష్ చదివిన వారికి, మున్సిపాలిటి పరిధిలో చదివిన వారికీ 75:25 నిష్పత్తిలో సీట్లు కేటాయింపు ఉంటుందన్నారు. జూన్ ఒకటి నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూఏఎన్‌జిఆర్ఏయుఏసి.ఇన్ సందర్శిం చాలని ఆయన సూచించారు. ఆన్‌లైన్ రెజిస్ట్రేషన్, ఇతర వివరాలకు కోసం 0877-2249909, 9618167187 సంప్రదించాలని ఆయన కోరారు.

## బావాజీ ఆలయ నిర్మాణంలో భాగస్వాములుకండి

**-కేరళ ఐపిఎస్ అధికారి లక్షణ్ నాయక్**



తిరుపతిరూరల్, జూన్ 3 ప్రభాతవార్త: బంజరాల ఆరాధ్య దైవమైన శ్రీస్వామి హథీరాంజీ బావాజీ ఆలయ నిర్మాణంలో బంజరాలు భాగస్వామ్యం కావాలని కేరళ ఐపిఎస్ అధికారి గూగులోత్ లక్ష్మణ్ నాయక్ పిలుపునిచ్చారు. తిరుపతిరూరల్ వేదాంతపురం గ్రామ పంచాయతీ పరిధిలోని విద్యుత్ నగర్‌లో నూతనంగా నిర్మాణం జరగనున్న బావాజీ ఆలయ నమూనాను సోమవారం ఆయన సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 15కోట్ల మంది బంజరాలు ఉన్నారని, బంజరాల ఆరాధ్య దైవమైన బావాజీ ఆలయ నిర్మాణం తిరుపతి నిర్మించడం సంతోషదాయకమన్నారు. దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా 64దేశాలలో బంజరాలు ఉన్నారని, బావాజీ ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. శ్రీహథీరాంజీ బావాజీ ఆలయ ఛైర్మెన్ శివా నాయక్ మాట్లాడుతూ శ్రీవారికి ప్రియ భక్తుడైన బావాజీకి వేల కోట్ల ఆస్తులు ఉన్నా ఎక్కడా ఆలయం లేదని, తిరుపతిలో ఆలయాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. బావాజీ ఆలయంతో పాటు మరియమ్మ గుడి, యాగశాల, బాలమందిరం, విజ్ఞానశాల, సేవాలాల్ మందిరం, పంక్సన్ హాలు తదితర నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హరిబాబునాయక్, హరిప్రసాద్ నాయక్, శివశంకర్, బాలాజీ, బరియా, ప్రసాద్, కిషోర్, లలితా బాయ్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## నారాయణవనంలో 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలు



నారాయణవనం, జూన్ 3 ప్రభాతవార్త : గత నెల 13వతేది జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబందించి మంగళవారం(నేడు) కౌటింగ్ జరగనున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ విష్ణుకుమార్‌రాజు ఆదేశాల మేరకు పుత్తూరు డిఎస్పీ శ్రీనివాసరావు సూచనల మేరకు ముందు జాగ్రత్త చర్యలో భాగంగా మండలంలో 144 సెక్షన్‌తో పాటు పోలీసు యాక్ట్ 30 అమలులో వుందని ఎస్ఐ డి లక్ష్మినారాయణ సోమవారం ప్రకటనలో తెలిపారు. మండలంలో ఇప్పటికే ప్రధానంగా మూడు మొబైల్ పార్టీ వాహనం తిరుగుతుందని, అలాగే ప్రతి గ్రామంలోను ముగ్గురు నుంచి నలుగురి పోలీసులను నియమించడం జరిగిందన్నారు. ప్రధానంగా నారాయణవనం, భీమునిచెరువు, కశింమిట్ట, తిరువట్యం, ఎరికంబట్టు, కీళగరం, అరణ్యంకండ్రిగ, పాలమంగళం, తుంబూరులో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

## వడదెబ్బ తగిలి వృద్ధుడి మృతి



పుత్తూరురూరల్, జూన్ 3 ప్రభాతవార్త: పుత్తూరు మున్సిపాలిటీ 19వ వార్డు ఆరేటమ్మ ఎస్టీ కాలనీకి చెందిన కె.కిష్టప్ప(81) అనే వృద్ధుడు కల్యాణపురం సచివాలయానికి పెన్షన్ కోసం వెళ్లి లైన్‌లో నిలబడి ఉండగా వడదెబ్బ తగిలి కింద పడిపోవడం జరిగింది. సచివాలయ సిబ్బంది సమాచారమివ్వడంతో వారి కుటుంబ సభ్యులు పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్ళగా రుయాకు తీసుకెళ్లాలని సూచించారు. రుయాలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## ప్రజాసేవకుని సేవల్ని శ్రీకాళహస్తి ప్రజలు మరువరు!



శ్రీకాళహస్తి,జూన్ 3 ప్రభాతవార్త : గతంలో ఏ శాసనసభ్యుడు నియోజకవర్గ ప్రజలకు సేవలందించని రీతిలో గత ఐదేళ్ళ పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలిందించి నేనున్నానని ఆదుకున్న బియ్యపు మధుసూధనరెడ్డి సేవల్ని మరువరని తొట్టంబేడు మండలానికి చెందిన సీనియర్ వైకాపా నాయకుడు ఉన్నం వాసుదేవనాయుడు అన్నారు. సోమవారం ఆయన పార్టీ కార్యాలయంలో శాసన సభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి కలిసారు.ఈ సందర్భంగా మంగళవారం జరుగు ఓట్ల లెక్కింపులకు సంబంధించి చర్చించారు. ఐదేళ్ళ పాటు ప్రజల సమస్యలను తమ సమస్యలుగా పరిష్కరించిన నాయకుడు మధుసూధనరెడ్డి అన్నారు.అయితే హోరాహోరి ఎన్నికల్లో శ్రీకాళహస్తి ప్రజలు ప్రతి పక్షాల మాటలు నమ్మలేదని మరో సారి మధుసూధనరెడ్డికి పట్టం కట్టి ఉంటారని ఆశాభావం వ్యక్తం చేసారు. ఆయనను తిరస్కరిస్తే శ్రీకాళహస్తి ప్రజలకు విశ్వాసం లేనట్లే అన్నారు. అంతేకాక రాష్ట్రంలో గతంలో ఏ ముఖ్యమంత్రి అందివ్వనన్ని సంక్షేమ పథకాలను అందించిన జగన్మోహన్‌రెడ్డికి మరో సారి రాష్ట్ర ప్రజలు పట్టం కట్టి ఉంటారని మంగళవారం ఇవిఎంలో తెరిస్తే ప్రతిపక్షాల నోళ్లు మూతపడతాయని ప్రజలు చంద్రబాబు,పవన్‌కళ్యాణ్, బిజెపిలను నమ్మరని వాసుదేవనాయుడు అభిప్రాయపడ్డారు. అయితే మధుసూధనరెడ్డి మాట్లాడుతూ తాను ఓ సేవకుడుగా సేవలందించానన్నారు.తానే కాకుండా తన కుమార్తెను కూడా ప్రజాసేవలకే అంకితం చేసామన్నారు. తమ సేవలను శ్రీకాళహస్తి ప్రజలు మరువరనే నమ్మకం తనకు ఉందన్నారు.

## అడుగింటిన స్వర్ణముఖి భూగర్భ జలాలు

**- గంగమీదనే ఆధారం-శ్రీకాళహస్తి ప్రజలకు దాహార్తి**

**నాగుల గుంటలో మూడు రోజులుగా అందని నీళ్లు**

శ్రీకాళహస్తి,జూన్ 3 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణ ప్రజల దాహార్తిని తీర్చిన స్వర్ణముఖి నదిలో భూగర్భజలాలు అడుగింటాయి.ఫలితంగా మంచినీటి సరఫరాకు అంతరాయం కల్గింది.ముఖ్యంగా మూడు రోజులుగా గాంధీవీధి,నాగుల గుంట పరిసరాల్లో నీటి సరఫరా లేక జనం తల్లడిల్లుతున్నారు.గత వారం కూడా మూడు రోజులు ఈ ప్రాంతాల్లో మున్సిపల్ మంచినీటి సరఫరాకు అంతరాయం కల్గినట్లు ప్రజలు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో అందరూ వ్యాపారస్తులే. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకొని జీవనం గడుపుతున్నారు. అయితే వ్యాపారస్తులు స్నానం చేయటానికి కూడా పట్టణంలోని లాడ్జిల వద్దకు వెళ్ళి స్నానం చేసే దుస్థితి చోటు చేసుకుంది.

**అడుగింటిన గంగ: తెలుగుగంగ మీదనే ఆధారం:**

శ్రీకాళహస్తి పట్టణ ప్రజల దాహార్తిని సుమారు 50 సంవత్సరాల పాటు తీర్చిన స్వర్ణముఖి నదిలోని శుకబ్రహ్మాశ్రమం పంప్ హౌస్, దానికి నీటిని సరఫరా చేసే బావుల్లో నీటి మట్టం బాగా తగ్గింది. ప్రారంభంలో ఒక్క స్వర్ణముఖి నదిలోని బావుల ద్వారానే మంచినీటి సరఫరా జరిగేది. నాడు బోర్లు లేవు. ప్రతి ఒక్క ఇంటికి తాగటానికి వాడకానికి ఉపయోగించుకునే వారు. అయితే 1989లో పట్టణ అవసరాలను గుర్తించిన పాలకులు తెలుగుగంగ నుంచి అధికారికంగా సరఫరా చేయటానికి రూపకల్పన చేసారు.అప్పటి నుంచి స్వర్ణముఖి,తెలుగుగంగ నీటిని కలిపి పంపింగ్ చేస్తూ సమస్య లేకుండా చేస్తున్నారు.అయితే స్వర్ణముఖి నదిలో భూగర్భ జలాలు అడుగింటడంతో పట్టణంలో మంచినీటి సమస్య ఎదురైంది. అసలే ఎండా కాలం, భూగర్భజలాలు అడుగింటాయి.బోర్లు ఎండి పోతున్నాయి. నీరు పరిమితంగా వస్తున్నాయి.దీనికి తోడు స్వర్ణముఖి నదిలో ఇసుకను తోడేయటంతో భూగర్భ జలాలు అడుగింటి పోయాయి దాంతో పట్టణ ప్రజల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

**డిఇఇ వివరణ:**

శ్రీకాళహస్తిలోని పలు ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు సంబంధించిన ఇబ్బందిని డిఇఇ లలితను వివరణ కోరగా గతంలో స్వర్ణముఖి తెలుగుగంగ నీటిని కలిపి సరఫరా చేసే వారమని తెలిపారు. అయితే గత కొంత కాలంగా స్వర్ణముఖి లో భూగర్భ జలాలు అడుగింటాయన్నారు. గతంలో గ్రావిటీ మీద నీరు పట్టణానికి చేరేవన్నారు.ప్రస్తుతం నీటి సరఫరా లేనందువల్ల సరఫరాకు సమన్వయం చేస్తున్నామన్నారు. ప్రస్తుతం తాను ఎన్నికల విధుల్లో ఉన్నామన్నారు.రెండు మూడు రోజుల్లో పరిష్కరిస్తామన్నారు.

## ప్రైవేటు పాఠశాలల ఆకస్మిక తనిఖీ

**-కందన్ ఇంగ్లీష్‌మీడియం పాఠశాలకు తాళాలు**




తొట్టంబేడు, జూన్ 3 ప్రభాతవార్త : పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు నిఘా ఉంచారు. శ్రీకాళహస్తి విద్యాశాఖ అధికారులు నిఘా ఉంచారు. ఈనేపథ్యంలో ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్యలుతో కమిటీ సభ్యుడు జ్ఞానప్పలు కలసిపట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలలను తనిఖీచేశారు. పట్టణంలోని గోపాలవనం వద్ద ఉన్న కందన్ ఇంగ్లీష్‌మీడియం పాఠశాలకు అనుమతి లేకపోవడంతో విద్యాశాఖ అధికారులు పాఠశాల యాజ మాన్యానికి షోకాజ్ నోటీసులు జారీచేశారు. అయినా వారు స్పందించక పోవడంతో సోమవారం విద్యాశాఖ అధికారులు పాఠశాలను తనిఖీచేసి పాఠశాలను మూసివేయించారు. అనుమతి లేని పాఠశాలల్లో తల్లిదండ్రులు విద్యార్థులను చేర్పించవద్దని ఎంఈవోలు తెలిపారు. ఈనెల 12వ తేదీన మాత్రమే పాఠశాలలు ప్రారంభించాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పట్టణంలోని విశ్వభారతీ, వివేకానంద పాఠశాలల్లో రికార్డులను తనిఖీచేసి పాఠశాలల వద్ద ఏఏ తరగతికి ఎంతెంత ఫీజులు వసూలు చేస్తున్నారో ప్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే కార్పొరేట్ పాఠశాలలైన శ్రీచైతన్య, నారాయణ, రత్నం, భాష్యం వంటి పాఠశాలల్లో కూడా ఏఏ తరగతికి ఎంతెంత ఫీజులు వసూలు చేయాలో ప్లెక్సీలు ఏర్పాటు చేయాలని లేకుంటే జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలతో చర్యలుతీసుకుంటామన్నారు. ఇక విద్యాకానుకకు సంబందించి శ్రీకాళహస్తి అర్బన్, రూరల్ పరిధిలో మొత్తం 147 పాఠశాలలు ఉన్నాయని వీటికి సంబందించి బెల్టులు 6867, సమవస్త్రాలు 10,360, నోటుపుస్తకాలు 64,367, పాఠ్యపుస్తకాలు 45,396, ప్రైమరీ నిఘంటువులు 789 కార్యాలయానికి చేరాయన్నారు. అనంతరం విద్యార్థులకు అందించే సమవస్త్రాలను పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభించగానే సంబందిత పాఠశాలలకు పుస్తకాలు చేరుస్తామని ఎంఈవోలు తెలిపారు. అనంతరం బాబుఅగ్రహారం మున్సిపల్ పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించడంతో పాటు ఈవిద్యాసంవత్సరం పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రుణపడి ఉండాలన్నారు.

## అకాల వర్షానికి విద్యుత్‌శాఖకు రూ.10లక్షలు నష్టం



తొట్టంబేడు, జూన్ 3 ప్రభాతవార్త : శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి శ్రీకాళహస్తి, కెవిబిపురం, ఏర్పేడు మరియు తొట్టంబేడు మండలాల్లో 20 ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగినట్లు విద్యుత్‌శాఖ తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షంతో నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతులు చేస్తున్నారని అంతేకాకుండా నేలకూలిన విద్యుత్ స్తంభాలును పునరుద్ధరించి విద్యుత్‌లైన్లను సిబ్బంది మరమ్మత్తులు చేపట్టారన్నారు. విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని వివరించారు. శ్రీకాళహస్తి డివిజన్‌లో కూడా సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు.

## అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



శ్రీకాళహస్తి, జూన్ 3 ప్రభాతవార్త : చెన్నైలో ఉన్న అబాకస్ మెంటల్ ఆర్థమెటిక్ టీచర్ అసోసియేషన్ సంస్థ గత నెల 19వ తేదీన నఇర్వహించిన 24వ అంతర్జాతీయ ఆన్‌లైన్ అబాకస్ కాంపిటీషన్స్‌కు పట్టణంలో లిటిల్ మాస్టర్ అబాకస్ ఇన్స్టిట్యూట్ నుంచి పోటీల్లో పాల్గొన్నా విద్యార్థుల్లో విజయం సాధించిన 9మంది విద్యార్థులకు నేడు బహుమతులు అందించి సత్కరించారు.ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్‌గాఫస్ట్ లెవల్‌లో పి.తనీష్ ,పి.తేజస్వీ, జి.సాయిపూజిత, ఎ.జశ్వంత్, బి.భావగ్న, రెండవ స్థాయిలో బి.యువల్‌ప్రీతం నాలగో లెవల్ టాపర్‌గా జె.గురుసాత్విక, రెండస్థాయిలో పి.హెచ్. నందకిషోర్, భానుమూర్తి, విద్యార్థులు వివిధ స్థాయిలో గెలుపొంది అవార్డులను కైవసం చేసుకున్నారు. తమ ఇన్స్టిట్యూట్ నుండి మొదటి, రెండవ మరియు మూడో స్థానాల్లో అవార్డులను కైవసం చేసుకున్న విద్యార్థులను డైరెక్టర్ దివ్య మరియు ఛైర్‌పర్సన్ మునికుమార్‌లు అభినందించి విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోను అందించారు.

**CHANGE OF NAME**

I,**NAGA CHANDRASEKHAR**, (old Name) R/o Toorpu Street, Driddaluru, Sydapuram, Nellore Dist. A.P. Have changed by Name as **NAGA CHANDRASEKHAR REDDY**(New Name) S/o Naga Hanumantha Reddy